

మహిళా హక్కుల పరిరక్షణ.. సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

అనంతపురం కలెక్టరేట్ : మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పని చేస్తోందని రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2023 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలకడం ఆనందంగా ఉందన్నారు. గడిచిన రెండు సంవత్సరాల్లో కరోనాతో అస్తవ్యస్తంగా మారిన రోజుల నుంచి ఇప్పుడిప్పుడే మానవ సంబంధాలు, జీవన స్థితిగతులు పంజుకుంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, నాయకులు జ్యోతి, రంగమ్మ, రామాంజినమ్మ, మంజుల, కవిత, రేవతి, రుణుక, లక్ష్మిదేవమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



పింఛను లబ్ధిదారులతో కలిసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పింఛన్ల తొలగింపును ఆపాల్సిందే

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం అనేక నిబంధనలు తీసుకొచ్చి అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు తొలగించేందుకు సిద్ధమైందని, ఆ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. పింఛన్ల తొలగింపును ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గ్రామ, వార్డు సచివాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. అనంతపురం నగరంలో సిపిఎం 1వ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు ప్రధాన కూడళ్లలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసాగా ఉన్న పింఛన్లను వివిధ నిబంధనల పేర్లతో తొలగించడం అన్యాయం అన్నారు. ఎక్కువ మంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ డబ్బులతోనే జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి ఒక నెల పింఛన్ రాకపోయినా జీవనం కష్టమవుతుందన్నారు. నాయకులు ఎన్నికల సమయంలో ఒక మాట..అయిపోయాక మరొక మాట చెబుతున్నారని విమర్శించారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ వచ్చినా, కుటుంబంలో 100 శాతం వికలాగత్వం ఉన్న సభ్యులు ఎంతమంది ఉన్నా ఒక్కరికే ఇవ్వడం, సదరు పత్రాలు సరిగా లేవని, ఇంటి విస్తీర్ణం ఎక్కువ ఉందని, కార్లు ఉన్నాయని పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. ఇప్పుడు ఇస్తున్న వారందరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. ఏ ఒక్కరి పింఛన్ తొలగించినా సిపిఎం పెద్ద ఎత్తున పోరాడుతుందని హెచ్చరించారు. నగరంలో ఇందిరానగర్, నీలిమ టాకీస్, శ్రీశ్రీ నగర్, రాజీవ్ కాలనీ పంచాయతీల్లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వెంకటేశు, రాజు, రామాంజి, రాము, సురేష్, చెన్నకేశవులు, పాండు, దేవా, వన్నూరప్ప, ఫక్కు, ఇస్మాయిల్, రాముడు, రాములమ్మ, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బంగారం జీరో వ్యాపారం..

'హిందూపురం పట్టణంలో నివాసముంటున్న రామాంజినేయులు తన కుతురి వివాహం కోసం పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న ఓ బంగారు దుకాణంలో బంగారం కొనుగోలు చేశాడు. బిల్లు అడిగినప్పటికీ ఇవ్వకుండా దుకాణం యజమాని తెల్ల కాగితంపై రాసిచ్చారు'.

'పట్టణంలో నివాసముంటున్న సుబహాన్ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన కూతురికి వివాహం నిశ్చయం కావడంతో ఓ దుకాణంలో 20 గ్రాముల బంగారం కొనుగోలు చేశాడు. ఇతనికి సైతం బిల్లు ఇవ్వకుండా తెల్ల కాగితంపై రాసి ఇచ్చారు'.

హిందూపురం పట్టణంలోని మెయిన్ బజారులో ఏ బంగారు షాపుకు వెళ్లి రూ.లక్షలు విలువజేసే బంగారం కొన్నప్పటికీ ఎవరూ బిల్లులు ఇవ్వరు. ఎవరైనా ఉద్యోగులు ఆదాయ పన్నుల శాఖ కార్యాలయానికి సమర్పించాలని అడిగితే తప్ప బిల్లులు ఇవ్వరు. ఒకవేళ ఇవ్వాలన్నా అన్ని పన్నులూ చేర్చి బిల్లులు ఇస్తున్నారు. బంగారు వ్యాపారులు సిండికేట్‌గా మారి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎటువంటి పన్నులూ చెల్లించకుండా బంగారం కొనుగోలు చేసి ఇక్కడ విక్రయించడం వల్లే బిల్లులు ఇవ్వడం లేదన్నది అక్షరసత్యం.

ఉమ్మడి అనంత జిల్లాలో నెలకు రూ.30 కోట్ల వ్యాపారం

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

పట్టని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంగారం వ్యాపారులు ప్రభుత్వానికి భారీ మొత్తంలో బురిడీ వేస్తున్నారనడానికి ఈ సంఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. భారీ లాభాల కోసం కొందరు జీరో బిజినెస్‌కు దిగుతున్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు ఎగ్గొట్టేందుకు బిల్లులు లేని బంగారాన్ని భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు కూడా ఇక్కడి నుంచే సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ వ్యాపారంలో కొందరు భారీగా వెనకేసుకుంటున్నట్లు సమాచారం. దీనిపై వాణిజ్యశాఖ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఖజానాకు జమకావాల్సిన పన్నులు చెల్లించకుండా జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెన్నై, కోయంబత్తూరు, బెంగళూరు, ముంబై తదితర ప్రాంతాల నుంచి బంగారాన్ని బిల్లులు లేకుండా కొనుగోలు చేసి తెచ్చి అమ్ముకుంటున్నారు. అనేకమంది వ్యాపారులు వార్షిక లావాదేవీలు రూ.కోటి లోపు చూపించి ప్రభుత్వానికి జిఎస్‌టి చెల్లించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి వ్యాపారం లాక్‌డౌన్ సమయం నుంచి మరింత ఊపందుకుంది. కొంతమంది దొంగ బంగారం కొనుగోలుచేసి కరిగించి ఆభరణాలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల వరుసగా కర్నాటక పోలీస్ అధికారులు పట్టుకుంటున్న కేసులు, బంగారమే ఇందుకు నిదర్శనం.

అధికారులు అనుమతిస్తే దాడులు చేస్తాం



బంగారం కొనుగోలు సమయంలో కొనుగోలు దారులు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) మూడు శాతం చెల్లిస్తారు. వ్యాపారులు ఆభరణాలు తయారుచేసి విక్రయించే సమయంలో వస్తువుపై వేసే లాభానికి మాత్రమే జిఎస్‌టి చెల్లిస్తారు. అయితే జీరోలో జరిగే వ్యాపారంలో పన్నులు చెల్లించరు. అధికారులు అనుమతులు ఇస్తే విస్తృతంగా దాడులు నిర్వహిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం – **శ్రీరాములు, వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్**



హిందూపురం పట్టణంలోని బంగారం దుకాణాలు

బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు

బంగారం వ్యాపారం బిస్కెట్ల రూపంలో హోల్‌సేల్‌గా జరుగుతుంది. అందుకు సంబంధించిన నగదు లావాదేవీలన్నీ బ్యాంకుల ద్వారా జరుగుతాయి. అయితే వ్యాపారులు బిల్లులు లేకుండా తక్కువ ధరకు బంగారాన్ని నేరుగా నగదు చెల్లించి కొనుగోలు చేస్తారు. ఈ బంగారమంతా బ్లాక్‌లో వ్యాపారం జరుగుతుంది. దీంతో ప్రభుత్వానికి పన్నులు చెల్లించకపోవడంతోపాటు, నల్ల డబ్బు చలామణి అవుతుంది. ఇదే తరహాలో కొనుగోలుదారులకు కూడా బిల్లులు ఇవ్వకుండా వ్యాపారం చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది. మరోవైపు కొనుగోలు దారులూ నష్టపోయే పరిస్థితి ఉంది.

లైసెన్స్ లేకుండానే వ్యాపారం

అనంతపురం జిల్లాలో దాదాపు 70 నుంచి 80 మంది వరకూ లైసెన్స్డ్ వ్యాపారులు ఉన్నారు. మరో 100 మంది వరకు ఎలాంటి లైసైన్సులూ లేకుండా వ్యాపారం చేస్తున్నారు. హిందూపురంలో 20 నుంచి 30 మంది వరకూ లైసెన్స్డ్ వ్యాపారులు ఉన్నారు. మరో 50 మంది వరకు ఎలాంటి లైసైన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్నారు. లైసెన్సు ఉన్న వారు సైతం ఎక్కువ వ్యాపారం బిల్లులు లేకుండానే సాగిస్తున్నారు. లైసెన్సులు లేని వారు అసలు ఎలాంటి బిల్లులూ ఇవ్వడం లేదు. ఈ ప్రకారం నెలకు సుమారుగా రూ.30 కోట్ల బంగారం వ్యాపారం జరిగితే సగం అంటే రూ.15 కోట్లకు బిల్లులు ఉండవు. తద్వారా నెలకు రూ.కోటికి పైగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఆ ప్రకారం ఏడాదికి రూ.12 కోట్ల మేర ఖజానాకు రాకుండా పోతోంది.

బిల్లులు లేకుండా వ్యాపారం

బంగారం టోకుగా ఇలా జరుగుతుండగా చిల్లర వ్యాపారులు అంటే.. బంగారం తయారీ పేరుతో దుకాణాలు నిర్వహిస్తున్న వారు బిల్లులు లేని బంగారం కొనుగోలు చేసి ఆభరణాలు తయారుచేసి విక్రయిన్నారు. కొంత బంగారాన్ని కరిగించి బిస్కెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి బిస్కెట్లు బ్లాక్‌మనీ ఉన్నవారు కొనుగోలు చేసి అధిక ధరలు వచ్చినప్పుడు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. భారీగా జీరో వ్యాపారం జరుగుతుంటే గుడ్లప్పగించి చూస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.



షూటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్

జిల్లా అధికారుల ఫైరింగ్ ప్రాక్టీస్

వెపన్స్ కండీషన్ టెస్టులో పాల్గొన్న అనంత, సత్యసాయి జిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పోలీసు అధికారులకు మన్నీల ఫైరింగ్ రేంజ్‌లో శుక్రవారం ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి నేతృత్వంలో జరిగిన ఫైరింగ్ ప్రాక్టీస్ సందర్భంగా వెపన్స్ కండీషన్‌పై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు ఎస్.నాగలక్ష్మి, బసంత్ కుమార్, అనంతపురం జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంతకుమార్, పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్ వెపన్స్ కండీషన్ టెస్టింగులో పాల్గొన్నారు. ఇరు జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు రెండు జిల్లాల అదనపు ఎస్పీలు, డీఎస్పీలు ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఎకె 47, ఎల్ ఎంజి, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్, 303, వివిధ రకాల ఫిస్టోల్స్, కార్బైన్, తదితర ఆయుధాలతో పోలీసు అధికారులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేయగా... ఇరు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు వెపన్ కండీషన్‌పై టెస్టు నిర్వహించారు. ప్రతీ అధికారి అన్ని రకాల ఆయుధాల పట్ల పరిజ్ఞానం కలిగి ఉండాలని, వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఇలాంటి ఫైరింగ్ ప్రాక్టీస్ ఎంతగానో ఉపయోగపడుతుందని రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అభిప్రాయపడ్డారు. ఫైరింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇరు జిల్లాల అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, రామకృష్ణప్రసాద్, హనుమంతు, పలువురు డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.



రైఫిల్ షూటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం : మంత్రి ఉషశ్రీచరణ్



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి ఉష శ్రీచరణ్

కుందుర్పి : ప్రజా సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యమని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మందలపల్లి, అప్పిలేపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమం అందాలన్న లక్ష్యంతో సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే గ్రామస్థాయిలో సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, సర్పంచి హసీనాబీ, మైనార్టీ సెల్ కార్యవర్గ సభ్యుడు అతావుల్లా, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సింగిల్ విండో ఛైర్మన్ వన్నూర్‌రెడ్డి, వందలాది మంది వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఛిద్రమైన బతుకులు..

ఆటో ప్రమాద కూలీల బాధలు వర్ణణాతీతం

ఆర్థిక స్థోమత లేక వైద్యం అందని దీనస్థితి

బాధితులను పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

గుత్తి పట్టణ శివారులో రెండు రోజుల క్రితం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వ్యవసాయ కూలీల కుటుంబాలు, తీవ్ర గాయాలతో బాధపడుతున్న 13 మంది కూలీల కన్నీటి గాధలు వర్ణనాతీతం. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను, క్షతగాత్రులను సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, స్థానిక నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులు తాము పడుతున్న బాధలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లి బోరున విలపించారు.

మూడు రోజుల క్రితం గుంతకల్లు మండలం వైటి.చెరువు గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కూలీలు పొట్టకూటి కోసం కల్లూరు మండలం కాసేపల్లి గ్రామ పొలాల్లో పత్తి పంట కోతలకు ఆటోలో వెళ్లారు. మధ్యాహ్నానికి వారు ఇళ్లకు రావాల్సి ఉంది. అయితే అదనపు కూలి కోసం సాయంత్రం వరకు పనిచేశారు. అనంతరం వారందరూ ఆటోలో ఇళ్లకు బయలుదేరాదు. గుత్తి పట్టణ శివారులో ఆటో బోల్తాపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 13 మంది క్షతగాత్రులు అయ్యారు. ఈ ప్రమాదంలో వ్యవసాయి కూలీ లక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందగా మరో కూలీ చెన్నమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. అయితే ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరణించిన వారి కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించిన పాపాన పోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే ఇంట్లోని జయమ్మ (ఆడబిడ్డ), సంధ్య, తులసి (తోడి కోడళ్లు) కాళ్లూ చేతులు విరిగి గుంతకల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడ్డ మరో కూలీ 8 నెలల గర్భిణి లక్ష్మమ్మ, సరళల బాధ వర్ణనాతీతం. ఆ ప్రమాదంలో వారి వీపు భాగంపై తీవ్ర గాయాలు కావడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. మరో కూలీ పద్మావతికి కాలు విరిగింది. పదేళ్ల క్రితం భర్త మరణించాడు. కూలి పనికి వెళ్లిన తన 11 ఏళ్ల కూతురుకి ప్రమాదంలో కనుబొమ్మలు పగిలిపోయాయి. కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళ్లి మూలనపడ్డానని పద్మావతి వాపోయింది. ఆర్థిక స్థోమత లేక మెరుగైన వైద్యం చేయించుకోలేక పోతున్నామని దీనంగా రోధించింది. ఈ ప్రమాదంలో 62 ఏళ్ల ముసలమ్మ, పెద్దక్క లకు భుజం ఎముకలు రెండూ విరిగిపోయాయి. మరో మహిళ సాలమ్మకు కూడా భుజం విరిగింది. వీరందరూ ఖరీదైన వైద్యం చేయించుకోలేక డోన్ దగ్గర రూ.1700 ఖర్చుతో నాటు వైద్యం చేయించుకుంటున్నారు. పూర్తిగా నయం కావడానికి మరో రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని బాధితులు కన్నీటిపర్యంతం అయ్యారు. ఈ స్థాయిలో ప్రమాదం జరిగినా ప్రజా ప్రతినిధులు గాని, రెవెన్యూ అధికారులు గాని కనీసం తమను పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడం.. చేసిన పనులకు సక్రమంగా బిల్లులు ఇవ్వకపోవడంతో తాము పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని బాధను వెళ్లగక్కారు. ఏదిఏమైనా ప్రమాదంలో మృతి చెందిన, గాయపడ్డ కూలీలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు.





క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

గుత్తి వద్ద ఆటో ప్రమాదంలో మరణించిన కూలీల కుటుంబాలను, క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ.. గతంలో పామిడి వద్ద జరిగిన ప్రమాదం తరహాలో ప్రభుత్వం మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం, రెండున్నర ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. తీవ్రంగా గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించాలని, కాళ్లూ చేతులు విరిగి మూలనపడ్డ కూలీలకు ప్రభుత్వం మూడు నెలలు నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు.

నిస్సహాయ రైతులకు అండగా 'జీవన రేఖ'

కౌలు రైతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని నిస్సహాయ రైతులకు అండగా నిలవడంతోపాటు రైతుల ఆత్మహత్యల నివారణ కోసం స్వచ్ఛంద సంస్థ 'రెడ్స్' సహకారంతో 'జీవన రేఖ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుపరిపాలన అందించేందుకు సాంకేతికతను ఉపయోగించి పలు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు సూచనలు అందించే హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా సెల్..94909 00800, 08554-297328 నెంబర్లకు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలకు పరిష్కారాలు పొందవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలు, పంట నమోదు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం వంటి అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో కౌలు రైతులకు ఇతర రైతులకు అందే పథకాలను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందులోభాగంగానే జిల్లాలో ఇప్పటి వరకూ 7,522 మందికి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్డులు పొందిన వారికి రైతు భరోసాతోపాటు పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఫలాలు అందుతాయన్నారు. కౌలురైతులను గుర్తించేందుకు ఆర్‌బికెల ద్వారా ప్రత్యేక సర్వే చేపడుతున్నామన్నారు. డిసెంబరు 31నాటికి సర్వే పూర్తి చేసి రికార్డులకెక్కని కౌలు రైతుల వివరాలు అందించాలని వ్యవసాయ శాఖను ఆదేశించామన్నారు. అలాగే జిల్లాలో 12 రకాల శాఖల పరిధిలోని సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే 'ఆరోగ్య అనంతపురం' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వ్యవసాయ శాఖ, పశు సంవర్థక శాఖ, పౌర సరఫరాల శాఖ, డీఆర్డీఏ, డ్రగ్స్, విద్య, ఫుడ్ సేఫ్టీ, ఆరోగ్య శాఖ, ఉద్యాన శాఖ, ఐసీడీఎస్, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ, తూనికలు మరియు కొలతల శాఖల పరిధిలోని సమస్యలను జిల్లా ప్రజలు 'ఆరోగ్య అనంతపురం' యాప్ ద్వారా జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, అన్ని డివిజన్ల ఎడిఎలు, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు భానూజ, హరీష్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

నార్పల : సర్పంచి వెంకటనారాయణమ్మ, ఎంపిటిసి శంకర్‌యాదవ్ సమక్షంలో మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఎదకురాని పశువులు, ఎద సూది వేసినా చూడి నిలబడని పశువులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే కొత్త రకాల పశుగ్రాస మొక్కలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి ఉప సంచాలకులు డాక్టర్ సుధాకర్, అనంతపురం ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, రెడ్డిపల్లి ట్రైనింగ్ సెంటర్ సహాయ సంచాలకులు రామచంద్రారెడ్డి, స్థానిక పశువైద్యాధికారి రాధిక, పశుగణాభివృద్ధి వినోద్‌కుమార్, డాక్టర్ గోవిందరాజు, ఎహెచ్‌ఎలు, గోపాలమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

రాయదుర్గం : ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ సంయుక్తంగా మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడాపోటీలు శుక్రవారం రాయదుర్గంలో ముగిశాయి. ఈ కార్యక్రమానికి రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పోరాళు శిల్ప హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి పోరాడే లక్ష్యాన్ని వెలుగులోకి తీసుకేచ్చేందుకు ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అంజి, రాజు, ఎఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, కొట్రేష్, వంశీ, అనిల్‌కుమార్, శాంతిరాజు, వీరేష్, నవీన్, సింహాద్రి, వైసిపి నాయకులు పోరాళు శివ, శ్రీరామ్‌రెడ్డి, ఇస్మాయిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

సజావుగా కౌన్సిల్ సమావేశం

గుత్తి : మున్సిపాలిటీ కార్యాలయంలోని సభా మందిరంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశం సజావుగా సాగింది. ముందుగా వార్డుల్లో ఏర్పాటుచేసిన స్పాట్ డెలివరీ ట్యాంకుల నిధులు మంజూరు కాలేదని కౌన్సిలర్లు ఫారుక్, వాల్మీకి శివ సభ దృష్టికి తెచ్చారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదనిచెప్పారు. అలాగే తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని వైస్ ఛైర్‌పర్సన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు అశ్వ రాముడు, ఖాజాఖాన్ విన్నవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, ఎఇ శరత్‌చంద్ర, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు బస్సు సౌకర్యం

తాడిపత్రి : తాడిపత్రి ఆటోనగర్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు శుక్రవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. కళాశాల నుంచి బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైసిపి విద్యార్థి విభాగం నాయకులు గంగులకుంట కేశవరెడ్డి స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన బస్సును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు పడుతున్న కష్టం తీరినట్లయింది. కాగా బస్సు సౌకర్యం కల్పించినందుకు ఎమ్మెల్యేకు, సంబంధిత అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఉదయం 9:10కి బస్టాండ్‌లో బయలుదేరి 9:30కి కళాశాలకు చేరుకుంటుందని, సాయంత్రం 4:30కి కాలేజ్ దగ్గర బయలుదేరి 4:50కి బస్టాండ్‌కు బస్సు చేరుకోనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

నేడు వాహనాల వేలంపాట

పుట్లూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన 4 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అనంతపురం ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3వేలు ధరావత్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

కబడ్డీ పోటీల్లో అనంత జెఎన్‌టియుకి ద్వితీయ స్థానం

అనంతపురం : నెహ్రూ యువకేంద్రం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అనంతపురం జెఎన్‌టియు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. రాప్తాడు మండలం కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపకులపతి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి అభినందించారు.

స్థల దాతలకు సన్మానం

గుమ్మఘట్ట : మండలంలోని కె.పి.దొడ్డి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనానికి సుమారు రూ.6లక్షల విలువజేసే 12 సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చిన స్థల దాతలు గొల్ల ఆవులప్ప కుమారులు గోవిందప్ప, పరమేశ్వరప్ప, తిప్పేస్వామిని సర్పంచి రమేష్, ప్రధానోపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ నాడు-నేడు కింద రెండవ విడతగా అదనపు గదులు నిర్మాణం కోసం స్థలం అవసరం కాగా ఇంతకుపూర్వం ఇచ్చిన స్థలదాతనే తిరిగి గ్రామంలోని పాఠశాల అభివృద్ధి కోసం స్థలం ఇవ్వాలని కోరగా దాదాపుగా ఐదు సెంట్లు స్థలం విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, వైస్ సర్పంచి రమేష్‌యాదవ్, విద్యాకమిటీ ఛైర్మన్ బోయ రమేష్, కమిటీ సభ్యులు వైసిపి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కొండను తవ్వి..ఎలుకను పట్టారు..

తప్పొకరిది..శిక్ష మరొకరికి.. - శింగనమల కెజిబివిలో కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు



ప్రజాశక్తి-శింగనమల

శింగనమల కస్తూరిబా పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన ఘటనలో ఎట్టకేలకూ అధికారులు 'కొండను తవ్వి.. ఎలుకను పట్టారు..' అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో ఒకేనెలలో రెండుసార్లు ఫుడ్‌ఫాయిజన్ అయ్యి విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. పాఠశాలలో సిబ్బంది మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ కారణంగానే ఫుడ్‌పాయిజన్ అయిందని భావించిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండేవారిపై బదిలీ వేటు, లేనివారికి ఉద్యోగం నుంచి తొలగింపు అన్న రీతిలో అధికారుల విచారణ సాగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 2న మొదటిసారి ఫుడ్‌పాయిజన్ జరగడంతో సుమారు 86 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనకు కేజీబీవీలో వంట సిబ్బంది, పనిచేసే సిబ్బందికి మధ్య తలెత్తిన వివాదాలే కారణంగానే ఫుడ్ పాయిజన్ జరిగిందని భావించి ఎస్ఓ, సిఆర్‌టి, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్‌ను విధుల నుంచి తొలగించారు. తిరిగి ఈనెల 23వ తేదీన రెండోసారి మజ్జిగలోకి బల్లి పడి 40 మంది విద్యార్థులు కడుపునొప్పి, వాంతులతో ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు వచ్చి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అటెండర్, ఎఎన్‌ఎం, ఒక అసిస్టెంట్ కుక్, డే, నైట్ వాచ్‌మెన్లను బాధ్యులను చేస్తూ విధుల నుంచి తొలగించారు. అదేవిధంగా అకౌంటెంట్, మరో కుక్‌ను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అకౌంటెంట్, అసిస్టెంట్ కుక్‌కు అధికార పార్టీ నాయకులు వత్తాసు పలకడంతోనే ఉద్యోగం నుంచి తొలగించకుండా కేవలం బదిలీ చేశారన్న విమర్శలు వినిస్తున్నాయి. అంతేగాకుండా విధుల నుంచి తొలగించిన అటెండర్, ఎఎన్‌ఎం, ఒక అసిస్టెంట్ కుక్, డే, నైట్ వాచ్‌మెన్లను బిసి, ఎస్సీలు కావడంతోనే చర్యలు తీసుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకంటే ఫుడ్ పాయిజన్ ఘటనల్లో అకౌంటెంట్ కీలకమని విచారణలో తెలిసినప్పటికీ బదిలీ చేయడం ఈ విమర్శలకు బలం చేకూరుతోంది. ఏదిఏమైనా శింగనమల కస్తూరిబా పాఠశాలలో జరిగిన ఘటనపై ఉన్నతాధికారులు లోతుగా విచారించి కిందిస్థాయి ఉద్యోగులను బదిలీ చేయడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నామని చెప్పవచ్చు.

ప్రభుత్వ విద్యా పరిరక్షణే లక్ష్యం

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ విద్యా పరిరక్షణే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) లక్ష్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ 53వ వసంతాల సందర్భంగా అనంతపురం నగరం ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేయడం కోసం నియంతృత్వ పరిపాలన చేస్తోందని విమర్శించారు. దేశంలోని యూనివర్సిటీలకు నిధులు కేటాయించడం లేదన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశ పెడుతూ విద్య ఆధారంగా మతాన్ని మతతత్వాన్ని మూఢత్వాన్ని పెంచి పోషించే ప్రయత్నం బిజెపి ప్రభుత్వం చేస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సిఎం జగన్ ప్రభుత్వం బీసీ, ఎస్టీ, ఎస్సీ, వెనకబడిన విద్యార్థులకు విద్యను అందిజేస్తానని చెబుతూ విద్యార్థులను తల్లి దండ్రులను మోసం చేసే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. దీనికి ప్రధాన నిదర్శనం ఇప్పటికే ఈ రాష్ట్రంలో 77 జిఓను ప్రవేశ పెడుతూ పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, రాకుండా జగన్ ప్రభుత్వం విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందన్నారు. డిగ్రీ కళాశాలలో ఎఫ్ఆర్ఎస్‌ని ప్రవేశపెడుతూ పేద మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులను ప్రభుత్వం విద్య నుంచి దూరం చేసే ప్రయత్నం కొనసాగిస్తోందన్నారు. సంక్షేమ హాస్టల్స్ నిర్వహణలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ 1970 సంవత్సరం నుంచి ఇప్పటిదాకా అనేక రూపాలలో పోరాటాలు కొనసాగించి విద్యార్థుల పక్షాన నిలిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాణి, సువర్ణ, నాగభూషణం, విజయ్, వినోద్, సతీష్, రాము, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయదుర్గం : విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా అధ్యక్షుడు బంగిశివ ఆధ్వర్యంలో పట్టణంలోని సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు ఆవుల మనోహర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిన 53 ఏళ్లలో విద్యార్థి సమస్యలపై అనుక్షణం పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థి ఉద్యమ పోరాటాల్లో అనేకమంది ఎస్ఎఫ్ఐ నాయకులు అసువులు బాసారన్నారు. భారత రాజ్యాంగ విలువల ప్రకారం ప్రతి ఒక్కరికీ విద్య అందే వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో విద్య కాశాయీకరణ, ప్రైవేటీకరణ చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విద్యా విధానాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ ఉచితంగా విద్య అందించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేటీకరణ ముసుగులో కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇచ్చి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇవి చాలవన్నట్టు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని విద్యని వ్యాపారకేంద్రంగా మార్చారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో కల్తీ, నాణ్యత లేని ఆహారం అందిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరికీ విద్య, నాణ్యమైన భోజన సదుపాయం కల్పించేంతవరకు ఎస్ఎఫ్ఐ అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, ఈరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గంగాధర్, శ్రీరాములు, శ్రీలేఖ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో మాట్లాడుతున్న నాయకులు

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

'అనంత సంకల్పం'పై సమీక్షలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చేపట్టిన 'అనంత సంకల్పం' కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది అంతా చదువులు చెప్పిన తర్వాత విద్యార్థులు పరీక్షల్లో ఫెయిలైతే ఆ వైఫల్యం వారిది మాత్రమే కాదని గుర్తుంచుకోవాలన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చేపట్టిన 'అనంత సంకల్పం' కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. గత విద్యా సంవత్సరం కోవిడ్ కారణంగా విలువైన కాలాన్ని కోల్పోయామని, ఈసారి అలాంటి పరిస్థితి లేనందున ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. వందరోజుల కార్యక్రమంలో భాగంగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు సైతం పబ్లిక్ పరీక్షల తరహాలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షల్లో ఫలితాల ఆధారంగా విద్యార్థులను విభజించి చదువులో వెనకబడుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షల్లో ఎలా రాస్తే ఎక్కువ మార్కులొస్తాయి, ఎలాంటి ప్రశ్నలు ముందు రాయాలి, ఎలాంటి ప్రశ్నలు చివర్లో రాయాలి, అసలు ప్రశ్నలకు సమాధానాలు ఎలా రాయాలి, తెలియని ప్రశ్నలకు ఏ విధంగా రాస్తే కనీస మార్కులు సంపాదించొచ్చు లాంటి విషయాలలో ప్రతి విద్యార్థికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఇళ్ల వద్ద పిల్లలు చక్కగా చదువుకునే వాతావరణం ఉండేలా చూడాలని కోరాలన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించేలా తల్లిదండ్రులను చైతన్య పరచాలన్నారు. బడికి పంపిస్తే ఉత్తీర్ణులను చేస్తాం అనే భరోసా తల్లిదండ్రులకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటకృష్ణారెడ్డి, డీవైఇఓలు పద్మప్రియ, శంకర్‌ప్రసాద్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీసీఈబీ కార్యదర్శి లోకేశ్వర రెడ్డి, ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల కుట్ర

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పేదలకు మంచి చేయాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళ్తున్న సిఎం జగన్, వైసిపి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నగరంలోని 49, 50వ డివిజన్లలో కార్పొరేటర్లు మునిశేఖర్, శేఖర్‌బాబుతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నాటికి రాష్ట్రంలో 39 లక్షల మందికి పింఛన్లు వస్తుంటే నేడు 65 లక్షల మందికి అందిస్తున్నట్లు వివరించారు. పింఛన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ సర్వసాధారణమని, అయితే ప్రతిపక్ష పార్టీలు మాత్రం పింఛన్లు తొలగిస్తున్నారంటూ దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ప్రతిపక్షాలకుతోడు కొన్ని పత్రికలు కూడా తాటికాయంత అక్షరాలతో రాతలు రాస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా వార్తలను ఎవరూ నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనవరిలో రూ.2750 పింఛన్ అందిస్తామన్నారు. పేదలకు పింఛన్, అమ్మ ఒడి, చేయూత వంటి పథకాలు అందిస్తుంటే అడుగడుగునా సైంధవుల్లా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు.

వైసిపి జిల్లా యువజన విభాగం కన్వీనర్‌గా పట్నం నగేష్

ప్రజాశక్తి-శింగనమల

జిల్లా యువజ న విభాగం కన్వీనర్‌గా పట్నం నగేష్ ఎన్నికయ్యారు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతున్న తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధితోపాటు బిసిల ఉన్నతికి తోడ్పడుతానన్నారు.



ఆర్.కృష్ణయ్యతో పట్నం నగేష్

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ఉరవకొండ : రైతులు వ్యవసాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల అధికారి మద్దిలేటి సూచించారు. శుక్రవారం విడపనకల్లు మండల పరిధిలోని మాలాపురంలో మండల వ్యవసాయ అధికారి హెచ్.పెన్నయ్య ఆధ్వర్యంలో రైతులు సాగుచేసిన పప్పుసెనగ, తెల్ల కుసుమ, ఎండుమిరప తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్ల, నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శనగపప్పు సెనగ పంటకు సోకే పురుగు నివారణకు ఇమామ్‌ఎక్టిన్ బెంజోయటి, ఎండు మిరప పంటకు సోకే నివారణకు నేటివా మందులను పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు ప్రవీణ్, ఎఇఒ రాఘవేంద్ర, గ్రామ అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ కె.జయరాములు, వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, మాజీ సర్పంచి పి.నాగన్నగౌడ్, గ్రామ వ్యవసాయ అధికారి యోగానంద, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్ : మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని మేయర్ మొహమ్మద్ వసీం సూచించారు. శుక్రవారం నగరంలోని రాజేంద్ర పురపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, ఎంఇఒ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని మండల పరిషత్ పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ షేక్ రహంతుల్లా తెలిపారు. గురువారం రుద్రంపేట పంచాయతీలోని పంతులకాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఎంపిటిసి నారాయణమ్మ, వార్డు సభ్యులు సుభద్రమ్మ, షాహీనా, హసీనా, హరిలత, వడ్డే ఆంజినేయులు, నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండలంలోని పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దండిన శివానంద, సర్పంచి బ్యులా రాణీ రాజశేఖర్, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీంరెడ్డి, ఎంపిటిసిలు విద్యశ్రీ, డి.లక్ష్మీదేవి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, ప్రధానోపాధ్యాయులు సర్వమంగళం, స్కూలు విద్యా కమిటీ ఛైర్మన్ సుంకిరెడ్డి, పాఠశాల సిబ్బంది, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : మండలంలోని కెపి దొడ్డి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు సర్పంచి రమేష్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ తెలిపారు. ఈకార్యక్రమంలో వైస్ సర్పంచి రమేష్‌యాదవ్, విద్యాకమిటీ ఛైర్మన్ బోయ రమేష్, కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

గుంతకల్లు : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి పవన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పాత కొత్తచెరువు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులుపాటు వివిధ రకాల పన్నులు మోపుతూ పేదలపై తీరని భారం మోపుతున్నారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిల్‌గౌడ్, మాజీ ఎంపిపి రాయల్ రామయ్య, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటేశులు, మాజీ కౌన్సిలర్ తలారి మస్తానప్ప, కేశప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, హనుమంతు, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లింగరాజు, రాష్ట్ర కార్యదర్శి కురుబ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

శిశువు మృతదేహం లభ్యం



చిన్నారి మృతదేహం

గుంతకల్లు రూరల్ : పట్టణ శివారులోని ఎస్‌కెపి కళాశాల సమీపంలో జిఎస్‌బిసి కాలువలో శుక్రవారం ఓ పసికందు మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన కొందరు వ్యక్తులు శిశుమృతదేహం కొట్టుకురావడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహం వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

మద్యం పట్టివేత

రాయదుర్గం : మండల పరిధిలోని ఎక్సైజ్ చెక్‌పోస్టు, కెపి దొడ్డి చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారులు, పోలీసులు శుక్రవారం మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ హిమబిందు తెలిపిన వివరాల మేరకు... పక్కాగా అందిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి మూడు ద్విచక్ర వాహనాల్లో మద్యం తీసుకొస్తుండగా దాడి చేసి నిందుతులను అదుపులోకి తీసుకుని, ఐదు బాక్సుల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నార్పల : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వివరాల మేరకు దాడితోట పరిసర గ్రామాల పరిధిలో ఉన్న చిత్రావతి నది నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

స్థానిక హమాలీలకే పనులు కల్పించాలి



శాతవాహన పరిశ్రమ యాజమాన్యానికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

బొమ్మనహాల్ : మండలంలోని శాతవాహన పరిశ్రమలో స్థానిక హమాలీలకే పనులు కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఈమేరక శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో శాతవాహన ఫ్యాక్టరీ యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పున ప్రారంభిస్తున్న శాతవాహన పరిశ్రమ ద్వారా స్థానికులకు దాదాపు మూడు వేల మంది దాకా పని కల్పించాలని చేశారు. అంతేకాకుండా కార్మిక చట్ట ప్రకారం కార్మికుల ప్రాథమిక హక్కులతోపాటు చేతి గ్లౌలు, హెల్మెట్, బూట్లు, యూనిఫారం, బలమైన ఆహారం అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని సూచించారు. అలాగే మండలంలో ఉన్న నిరుద్యోగ యువతకు ప్రముఖ ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ మండల యూనియన్ సంఘం సీటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష

బొమ్మనహాల్ : ప్రజల ఆశీస్సులే వైసిపికి శ్రీరామరక్ష అని విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కురువల్లి గ్రామంలో మాజీ ఎంపిటిసి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి జగన్‌ను సిఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పద్మ, ఎంపిడిఒ షకీలాబేగం, సిద్దరాంపురం, అరేసముద్రం, నెమకల్లు, బండూరు, శ్రీధర్‌ఘట్ట, దర్గాహొన్నూర్, బల్లలగుడ్డం, పొలగానహళ్లి గ్రామాల చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కురుబ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్

ఉరవకొండ : కురుబ సంఘం యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడిగా వజ్రకరూరు మండలానికి చెందిన వశికేరి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బలు శ్రీనివాసులు అధ్యక్షతన మదనపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కురుబల అభ్యున్నతి కోసం అలుపులేని పోరాటాలు చేసినందుకు గుర్తించి వశికేరి రమేష్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వశికేరి రమేష్ మాట్లాడుతూ సంఘం నేతలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : విడపనకల్లు మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జడ్పిటిసి హనుమంతు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మండలంలోని హవలిగి నుంచి డోనేకల్ గ్రామం వరకు దాదాపు 3 వేల ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఆయా గ్రామాల గుండా ఉన్న సాగునీటి కెనాల్‌లో పూడికతీత పనులతోపాటు కంపచెట్లు తొలగించి నీటిపారుదల పెరిగేలా చూడాలని కోరారు. అలాగే విడపనకల్‌లో ఆర్‌డబ్ల్యుఎస్ తాగునీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్డులు మరమ్మతులు చేపట్టడానికి ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసిందని, కావున కాలయాపన చేయకుండా వెంటనే పనులు చేపట్టాలన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లకు సంబంధించిన పనులతోపాటు పలు సమస్యలకు సంబంధించిన పనులు వెంటనే చేపట్టాలని కోరారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలి

అనంతపురం కలెక్టరేట్ : విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని స్నేహలత ఆసుపత్రి వైద్యురాలు బి.అరుణకుమారి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ ఏజి.రాజమోహన్ అన్నారు. శుక్రవారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 1వ రోడ్డులోని శారదా హైస్కూల్‌లో ఆడపిల్లల ఆరోగ్య సమస్య లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డాక్టర్ అరుణ కుమారి ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్ ఎంఎన్‌టి.రాజు, శారదా స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తారు రోడ్డు నిర్మాణం

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని పాత కొత్తచెరువు గ్రామంలో అగ్రికల్చర్ మార్కెటింగ్ కార్పొరేషన్ నిధులు రూ.17.5 లక్షలతో శుక్రవారం తారు రోడ్డు నిర్మించారు. కొత్తచెరువు బస్టాండ్ నుంచి సచివాలయం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం ఏఎంసి నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ డిఇ మురళీధర్, ఓబులేసు, సచివాలయ ఇంజినీర్ మానస తెలిపారు.

జెఎన్‌టియు బిటెక్ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బి.టెక్ పరీక్ష పలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యు యేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.టెక్ 1వ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ, బి.టెక్ 1వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19) సప్లిమెంటరీ, బిటెక్ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.20), (ఆర్.19) పరీక్షా పలితాలు విడుదల చేసినట్లు తెలిపారు. ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.